# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 3 | సంచిక : 53 | శనివారం 4 జనవరి 2025 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# పంచాయతీతో పాటే మున్సిపల్

- ఈ నెల 26న ముగియనున్న మున్సిపాలిటీల టర్మ్
- కొత్తగా 12 మున్సిపాలిటీలు 2 కార్పొరేషన్ల ఏర్పాటు
- డివిజన్లు ఓటర్ల లిస్టుపై అధికారుల కసరత్తు
- శివారు పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం

హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలతో పాటు. లేదంటే కొద్ది రోజుల గ్యాప్తో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 26తో మున్సిపాలిటీల టర్మ్ ముగియనుంది. సంక్రాంతి పండుగ తర్వాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ చేసి ఈ నెల చివరివారం నుంచి ఫిబ్రవరి మొదటి వారంలోగా మూడుదశల్లో ఎలక్షన్స్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. కులగణన వివరాలు ఇప్పటికే బీసీ డెడికేషన్ కమిషన్ కు చేరడంతో త్వరలోనే సర్కారుకు రిపోర్టు ఇవ్వనుంది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్ల పై సర్కారు ప్రకటన చేయగానే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. పంచాయతీల పదవీకాలం గతేడాది ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ బీసీ రిజర్వేషన్లపై - మిగతా3లో





# అలా చేస్తే కఠిన చర్యలు..

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాస్ వార్నింగ్
- రోడ్డు రవాణా , ఆర్టీసీ, భవనాలు రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ పాయింట్లను గుర్తించి తొలగిస్తాం
- రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ ఒక ముగ్గరికి అవగాహన కల్పించాలి

హైదరాబాద్

రోడ్డు నిబంధనలు ఉల్లగించిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. రోడ్డు రవాణా , ఆర్టీసీ, భవనాలు రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ పాయింట్లను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఈ నెల 7 వ తేదీ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీతో భేటీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రోడ్డు భద్రతపై చర్చిస్తామని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ పై ఆవేర్నెస్ కల్పిస్తామని అన్నారు. భాగ్యనగరంలో అనేక జంక్షన్‌లు వస్తున్నాయని.. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ ఒక ముగ్గరికి అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందరికీ నూతన సంవత్సర - మిగతా3లో

# మహానగరంకు సాగర్ నీరు!



- హైదరాబాద్ మంచినీటి కొరత తీర్చేందుకు
- బోర్డు చైర్మన్ హోదాలో జలమండలి అధికారులతో తొలిసారి సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- 2050 నాటికి నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన
- గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుపై అధికారులతో చర్చించిన సీఎం
- మంజీరా పైప్ లైన్‌కు అదనంగా ప్రత్యామ్నాయ పైప్ లైన్ నిర్మించాలని సూచన

హైదరాబాద్

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ జల మండలి బోర్డుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ(శుక్రవారం) భేటీ అయ్యారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సరఫరాకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. హైదరాబాద్ మహానగరంలో వినియోగదారులకు సమర్థవంతంగా మంచినీటి సరఫరా చేసే ప్రణాళికలపై మాట్లాడారు. గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టుకు మల్లన్న సాగర్ నుంచా లేక కొండపోచమ్మ సాగర్ నుంచి నీటు తీసుకురావాలా అనే అంశంపై చర్చించారు. మల్లన్న సాగర్ నుంచే హైదరాబాద్ మంచినీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ మంచినీటి కొరత తీర్చేందుకు గతంలో సిద్ధం చేసిన 15 టీఎంసీల ప్రతిపాదనలను 20 టీఎంసీలకు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. మంజీరా పైప్‌లైన్‌కు అదనంగా ప్రత్యామ్నాయ పైప్‌లైన్ నిర్మాణం చేయనున్నారు. - మిగతా3లో

## రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా
# ఢిల్లీని తీర్చిదిద్దుతాం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు
- వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుంది

## జిల్లాల పర్యటనకు
# టీపీసీసీ చీఫ్



- ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు పర్యటన
- స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేయనున్నారు.
- బీసీల గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు
- పదేళ్లు బీసీలను అణగదొక్కి అగ్రవర్ణాలకే అంకితమయ్యారు

# నేను కూడా శీష్ మహల్ కట్టగలను




- కావాలంటే అద్దాలమేడ కట్టుకునేవాడిని..
- ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రధాని మోదీ విమర్శలు
- గత పదేళ్ల నుంచి ఢిల్లీని ఆపద చుట్టేసింది
- అన్నాహజారేను ముందు పెట్టి, కొందరు నిజాయితీలేని వాళ్లు ఢిల్లీని ఆపదలోకి నెట్టేశారు
- ఆప్ పార్టీ.. ఢిల్లీపై ఆపదలా పడి, మొత్తం దోచేసుకుంటోంది

# నేను కూడా శీష్ మహల్ కట్టగలను



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిశిత విమర్శలు చేశారు. దేశరాజధానిలోని 4 కోట్ల మంది ప్రజలకు నివాస గృహాలు కల్పించడం ద్వారా సొంతింటి కలను తాము సాకారం చేశామని, తన కోసం ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదని, తాను కూడా 'శీష్ మహల్' కట్టగలనని ప్రధాని అన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో కేజ్రీవాల్ నివసించిన విలాసవంతమైన భవనం 'శీష్ మహల్' కొద్దికాలంగా వార్తల్లో ప్రముఖంగా ఉంది. అశోక్ విహార్ రామ్‌లీలా గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ, భారతదేశం ఈరోజు రాజకీయ, ఆర్థిక సుస్థిరతకు ఒక నిదర్శనంగా నిలిచిందని, 2025లోనూ ప్రపంచ దేశాల్లో భారతదేశ స్థానం మరింత బలపడనుందని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాల్లో ఒకటిగా ఈ ఏడాది భారతదేశం నిలువనుందని అన్నారు. ఈరోజు ఢిల్లీకి గుర్తుండిపోయే రోజని, గృహ, మౌలిక వసతుల, విద్యారంగాల్లో గుణాత్మక మార్పులు తెచ్చే ప్రాజెక్టులతో సిటీ అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. "ఈ రోజు ఇక్కడకు వచ్చినప్పుడు ఎన్నో పాత జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. పబ్లిక్ వర్క్స్ శాఖ రిలీజ్ చేసిన ఇన్వెంటరీలో విస్తుపోయే లెక్కలు ఉన్నాయి. సీఎం బంగ్లా కోసం చాలా హైఎండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల్ని వాడినట్లు ఉన్నది. దీంతో బీజేపీ, ఆమ్ ఆద్మీ మధ్య రాజకీయ వేడి చెలరేగింది.

గత పదేళ్ల నుంచి ఢిల్లీని ఆపద చుట్టేసిందని, అన్నాహజారేను ముందు పెట్టి, కొందరు నిజాయితీలేని వాళ్లు ఢిల్లీని ఆపదలోకి నెట్టేశారని, ఆప్ పార్టీ.. ఢిల్లీపై ఆపదలా పడి, మొత్తం దోచేసుకుంటోందని ప్రధాని విమర్శించారు. రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ఇండియా సింబల్‌గా మారిందన్నారు. 2025లో భారత పాత్ర మరింత బలపడిందన్నారు. ఈ ఏడాది ప్రపంచ పట్టికలో ఇండియాను మరింత ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. ఇండియాను అతిపెద్ద ఉత్పత్తి దేశంగా మార్చాలన్నారు. ఢిల్లీ అభివృద్ధికి ఇది చాలా ముఖ్యమైన రోజు అని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

జుగ్గి-జోప్రి అర్బన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు చెందిన 1675 ఫ్లాట్లను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. అశోక్ విహార్ ఏరియాలోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో నిర్మించిన ఈబ్ల్యూఎస్ ఫ్లాట్లకు చెందిన లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు.

ఇందిరాగాంధీ నియంతృత్వానికి వ్యతిరేకంగా యావద్దేశం పోరాడుతున్నప్పుడు నాలాంటి ఎందరో అజ్ఞాతంలో ఉండి ఉద్యమించారు. ఇదే అశోక్ విహార్‌లో జీవనం సాగించాను" అని మోదీ తెలిపారు. దీనికి ముందు రూ.4500 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను మోదీ ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అశోక్ విహార్‌లోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్‌లో ఇన్-సిటు స్లమ్ రిహాబిలేషన్ ప్రాజెక్టు కింద మురికివాడల కోసం నిర్మించిన కొత్త ఫ్లాట్‌లను ప్రధాని సందర్శించారు.

# రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా ఢిల్లీని తీర్చిదిద్దుతాం

రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కార్లపై మరోసారి నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమంత్రి తెలిపారు. అదనంగా రూ.12500 కోట్ల సీఆర్ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు.




వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందుల పడుతుందని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని.. దాంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను తీసుకువచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కొత్త రోడ్ నెట్‌వర్క్‌తో వాహనాల రద్దీ తగ్గుతుందన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ చుట్టూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించిందని.. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ప్రాజెక్ట్ కింద.. ఢిల్లీ-కత్రా ఎక్స్‌ప్రెస్ వేతో కుండ్లి మనేసర్ పాల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే.. లేదంటే వెస్ట్రన్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా కనెక్టివిటీని అందించే ఫేజ్-2ని మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోంది. ఆయా రోడ్‌నెట్ వర్క్‌ల ద్వారా జమ్మూ కశ్మీర్, పంజాబ్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా విమానాశ్రయం, ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేకు చేరుకునేలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కొత్త రోడ్ నెట్‌వర్క్ ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేకి నేరుగా కనెక్టివిటీని అందిస్తుందని.. దాంతో రాజధానిలో రద్దీని తగ్గించడంలో సహాపడుతుంది. మహిపాల్‌పూర్, రంగ్‌పురి ప్రాంతాల్లో రోజువారీ ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు ఐదు కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మించే యోచనలో ఉన్నట్లు గడ్కరీ వివరించారు. రూ.3,500 కోట్లతో ఈ సొరంగాన్ని నిర్మించనున్నారు. ఈ సొరంగం వసంత్ కుంజ్‌లోని శివమూర్తి, నెల్సన్ మండేలా మార్గ్‌లను కలుపుతుంది.

# చైనాలో మరో మహమ్మారి..
# హెచ్‌ఎంపీవీ లక్షణాలు, నివారణ చర్యలు ఇవే..!

ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారికి పుట్టినిల్లుగా చెప్పుకునే చైనాలో ఇప్పుడు మరో వైరస్ వ్యాప్తి కలవరానికి గురిచేస్తోంది. ప్రస్తుతం అక్కడ హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందిందని, కొవిడ్ వెలుగులోకి వచ్చిన సరిగ్గా ఐదేండ్ల తర్వాత మరో ప్రమాదకర వైరస్ వ్యాప్తి చెందుతున్నదని స్థానిక, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ వైరస్ బారినపడి అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల్లో చేరుతున్నట్లు సమాచారం. హెచ్‌ఎమ్‌పీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్ -19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ ప్రకటించినట్లు పలువురు నెటిజన్లు పేర్కొంటున్నారు. అయితే, దీనిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఈ కొత్త వైరస్ లక్షణాలు, ఎలా వ్యాపిస్తుంది, నివారణ చర్యలు వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కొవిడ్ తరహా లక్షణాలే**

ఈ వైరస్ సోకిన వారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తాయని తెలిసింది. దగ్గు, జ్వరం, ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఈ వైరస్ సోకిన వారిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. వైరస్ తీవ్రమైతే బ్రోన్కైటిస్, న్యుమోనియా వంటి సమస్యలకు దారితీస్తుంది. మూడు లేదా ఆరురోజుల వరకూ లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ తీవ్రతను బట్టి లక్షణాలు వేర్వేరు వ్యవధిలో ఉంటాయి. కరోనా మాదిరిగానే




ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ ఈజీగా సోకుతుంది. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ దరి చేరకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం.. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రద్దీ ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండడం వంటివి తప్పనిసరిగా పాటించాలి. తద్వారా వైరస్ వ్యాప్తిని కాస్తమేర కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

# నాసా, ఇస్రో కలిసి ప్రయోగాలు

**బెంగళూరు :** 2025లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరింత దూకుడుగా ప్రయోగాలు చేపట్టబోతోంది. ఇప్పటికే చంద్రయాన్, ఆదిత్య ఎల్-1 మిషన్‌తో ఇస్రో ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. అగ్రరాజ్యాల సరసన తలెత్తుకుని నిలబడేలా స్థాయికి వెళ్లింది. సొంత ఉపగ్రహాలనే కాదు? విదేశీ శాటిలైట్స్‌నూ నింగిలోకి పంపి కమర్షియల్‌గానూ సూపర్ సక్సెస్ అయ్యింది ఇస్రో. అలాగే 2025లో కూడా ప్రపంచం మొత్తం నివ్వెరపోయేలా.. అంతా ఇస్రో వైపు చూసేలా ప్రయోగాలు చేస్తామంటున్నారు శాస్త్రవేత్తలు. ఈ ఏడాది ఇస్రో నాలుగు ఖూ౦ఎ, మరో నాలుగు ఊ౦ఎ, మూడు ఊ౦ఎ మార్క్ 3 ప్రయోగాలు చేపట్టబోంది ఇస్రో. ఇందులో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాతో కలిసి ఇస్రో ఔిమాంఖీ ప్రయోగం చేపట్టబోతోంది. ఇప్పటికే దీని బడ్జెట్ 12వేల 505 కోట్లుగా ప్రకటించారు. ఫిబ్రవరి లేదా మార్చిలో ఈ ప్రయోగం ఉండే ఛాన్స్ ఉంది. ఈ నాసా ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్ తక్కువ భూకక్ష్యలో




తిరుగుతూ భూమిని 12 రోజుల్లో చుట్టేయగలదు. ఇది భూమికి సంబంధించిన విలువైన సమాచారాన్ని అందిస్తుంది. భూమిపై ఉన్న సముద్రాల్లో వచ్చే మార్పులు, భూకంపాలు, సునామీలు వంటి ప్రకృతి విపత్తులను వెంటనే పసిగట్టి సమాచారం ఇస్తుంది. అవసరమైతే శాటిలైట్ చిత్రాలను పంగలదు. దీంతో ఈ ప్రయోగాన్ని ఇటు ఇస్రో అటు నాసా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.ఇక గత దశాబ్ధంగా ఇస్రో నాలుగు వందల మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కమర్షియల్ శాటిలైట్ వెహికిల్స్‌ను లాంచ్ చేయడం ద్వారా సంపాదించింది. అమెరికాకు కూడా 172 మిలియన్ డాలర్ల రెవెన్యూ తెచ్చిపెట్టింది. ఇప్పుడు జీఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలతో సత్తా చాటనుంది. ఎన్‌వీఎస్ 2 నేవిగేషన్ శాటిలైట్, ఎల్‌వీయమ్ 3 అండ్ ఎమ్5 మిషన్‌ను కూడా షెడ్యూల్ చేసింది. దీంతో 2025లో కూడా అస్సల్ తగ్గేదేలే అంటున్నారు శాస్త్రవేత్తలు.

## సీఎంపై కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు.. ఎవరంటే..?



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' సీనియర్ నేత, ముఖ్యమంత్రి అతిషిపై పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. కల్కాజీ నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబా పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా శుక్రవారంనాడు ప్రకటించింది. కల్జాజీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా అతిషి పోటీలో ఉన్నారు. ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల్లో 51-కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అల్కా లంబా అభ్యర్థిత్వాన్ని సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఆమోదించినట్టు ఏఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. కల్కాజీ నియోజకవర్గంలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య సంప్రదాయకంగా హెూరాహెూరీ పోరు ఉంటుంది. కాగా, అల్కా లంబా 2015లో 'ఆప్' టిక్కెట్టుపై చాందినీ చౌక్ నుంచి గెలిచారు. 2019లో పార్టీ నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్‌లో చేరారు.

**ఫిబ్రవరిలో ఎన్నికలు**

ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్నారు. గత ఎన్నికలు 2020 ఫిబ్రవరిలో జరిగాయి. ఎన్నికల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మూడోసారి సీఎం పగ్గాలు చేపట్టారు. ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి 2025 ఫిబ్రవరి 15వ తేదీతో ముగియనుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గరియాబాద్ జిల్లా ఇందగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోలు హతమయ్యారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో స్థానిక పోలీసులు, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన సైనికులు కూడా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు నక్సలైట్లు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలిపారు.

## మహాకుంభమేళా..
## ప్రత్యేక వెబ్‌పేజీని ప్రారంభించిన ఐఎండీ

జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళా కు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ



తాజాగా కీలక ప్రకటన చేసింది. కుంభమేళా నేపథ్యంలో ప్రత్యేక వెబ్‌పేజీని రూపొందించినట్లు తెలిపింది. అందులో ప్రతి 15 నిమిషాలకోసారి వాతావరణ పరిస్థితిని తెలుసుకోవచ్చని ఐఎండీ డైరెక్టర్ మనీశ్ రణాల్కర్ తెలిపారు. అంతేకాకుండా రోజుకు రెండు సార్లు వాతావరణ సూచనలను జారీ చేస్తామని వెల్లడించారు. 'రాబోయే మహా కుంభమేళాను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక వెబ్‌పేజీని ప్రారంభించాం. అందులో ప్రతి 15 నిమిషాలకోసారి వాతావరణ పరిస్థితిని తెలుసుకోవచ్చు. అంతేకాకుండా రోజుకు రెండు సార్లు వాతావరణ సూచనలు ఈ వెబ్‌పేజీలో అందుబాటులో ఉంటాయి' అని మనీశ్ రణాల్కర్ తెలిపారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం



ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. రాజధాని భువనేశ్వర్ లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ రాజీనామాతో.. ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబును నియమిస్తూ గతేడాది డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్ర హెూంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా ఇవాళ మణిపూర్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. దేశంలోని ఐదు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. బీహార్ గవర్నర్‌గా ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, కేరళ గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు, మిజోరం గవర్నర్‌గా జనరల్ విజయ్ కుమార్ సింగ్, మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హెూంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను నియమించింది. ఈ మేరకు గత నెల 24న రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

# పంచాయతీతో పాటే మున్సిపల్ ఎన్నికలు!

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయం పెండింగ్లో ఉండడం వల్లే ఎన్నికలు ఆలస్యమవుతూ వచ్చాయి. మున్సిపల్ ఎన్నిలకు ఆ సమస్య లేకపోవడంతో పంచాయతీ ఎన్నికలతోపాటే నిర్వహించాలని సర్కారు భావిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

**నేడో.. రేపో.. గెజిట్:**

రాష్ట్రంలో ఇప్పటికే 141 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవల కొత్తగా 12 మున్సిపాలిటీలను, మహబూబ్ నగర్, మంచిర్యాల కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిపై నేడో, రేపో గెజిట్ విడుదల కానుంది. ఇందులో 129 మున్సిపాలిటీల టర్మ్ ఈ నెల 26తో ముగియనుంది. మరో 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల టర్మ్ ఈ ఏడాది మే వరకు ఉంది. జీహెచ్ఎంసీ టర్మ్ వచ్చే ఫిబ్రవరి వరకు ఉన్నప్పటికీ ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించే చాన్స్ ఉంది. గతంలో 138 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగ్గా 5 మున్సిపాలిటీల పాల్వంచ, జహీరాబాద్, మణుగూరు, ఆసిఫాబాద్, మందమర్రి కు ఎన్నికలు జరగలేదు.

**మార్పులు చేర్పులు షురూ:**

ప్రభుత్వం ఇటీవల 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు ఏర్పాటుతో పాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధి పెంచింది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటన చేసింది. 12 మున్సిపాలిటీల్లో కోహీర్, గుమ్మడిదల, గడ్డ పోతారం, ఇస్నాపూర్ సంగారెడ్డి జిల్లా, చేవేళ్ల, మోయినాబాద్ రంగారెడ్డి జిల్లా, మద్దూర్ కొడంగల్ నియోజకవర్గం, దేవరకద్ర మహబూబ్ నగర్ జిల్లా, కేసముద్రం, స్టేషన్ ఘన్ పూర్ వరంగల్ జిల్లా, అశ్వారావుపేట కొత్తగూడెం జిల్లా, ఏదులాపురం ఖమ్మం జిల్లా, ఉన్నాయి. వీటిలో జనాభా, ఓటర్ల ప్రకారం డివిజన్ల ఏర్పాటుపై అధికారులు కసరత్తు షురూ చేశారు. నెలరోజుల్లో ఈ ప్రాసెస్ పూర్తి కానున్నట్లు సమాచారం. మరో వైపు హైదరాబాద్ శివారులో ఉన్న 58 గ్రామ పంచాయతీలను సైతం శివారు మున్సిపాలిటీల్లో సర్కారు విలీనం చేసింది. ఇక్కడ కూడా వార్డుల విభజన సాగుతున్నది. ఇవన్నీ నెల రోజుల్లో కొలిక్కి రానుండగా, పంచాయతీల వెంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి సమస్య ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**కొలిక్కి రానున్న రిజర్వేషన్లు:**

లోకల్ బాడీల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల కులగణన చేపట్టింది. ఇందుకు సంబంధించిన డేటా ఎంట్రీ కూడా దాదాపు పూర్తయ్యింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయగా వారంలోగా ప్రభుత్వానికి రిపోర్ట్ అందించనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లపై సర్కారు ప్రకటన చేయగానే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. ఆ లెక్కనే పెరిగిన బీసీ రిజర్వేషన్ల ఆధారంగా మున్సిపాలిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వవచ్చని అధికారయంత్రాంగం భావిస్తున్నది.

# స్పోర్ట్స్ ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళిక,...

## మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్:** తమ ప్రభుత్వం స్పోర్ట్స్ ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్గా మంత్రి శ్రీధర్ బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబును భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఇవాళ(శుక్రవారం) కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బ్యాడ్మింటన్ను ప్రోత్సహించాలని పుల్లెల గోపీచంద్ అకాడమీ ఏర్పాటు చేశారని చెప్పారు. అనేకమంది క్రీడాకారులను తయారు చేసిన ఘనత గోపీచంద్ అకాడమీది అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంకల్పించారని చెప్పారు. గ్రామీణ ప్రతిభను వెలికి తీయడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. బ్యాడ్మింటన్ ప్రోత్సాహానికి కూడా తాము ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 3వ తేదీనుంచి 10వ తేదీవరకు ఆల్



ఇండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ జరుగుతుందని వివరించారు. గచ్చిబౌలి స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరుగుగుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

దేశంలో బ్యాడ్మింటన్కు మంచి గ్రోత్ ఉందని.. వచ్చే ఏడాది నుంచి అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహిస్తామని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అండర్ 19 ఆల్ ఇండియా జూనియర్, ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బ్రోచర్ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్కు మంత్రి శ్రీధర్ బాబు ప్రెసిడెంట్ అయ్యాక మొదటిసారి కలిశామని అన్నారు. ఈరోజు నుంచి జనవరి 10వ తేదీ వరకు ఆల్ ఇండియా జూనియర్ ర్యాంక్ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. 7వ తేదీన మంత్రి శ్రీధర్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ పెట్టాలనే నిర్ణయం మంచిదని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే క్రీడాకారులకు ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరమని చెప్పారు. క్రీడాకారులకు ఉద్యోగాలు, ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుందని అన్నారు. స్పోర్ట్స్పై విధిస్తున్న జీఎస్టీ తీసివేస్తే బాగుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ తీసివేస్తే క్రీడాకారుల తయారీకి ప్రోత్సహించినట్లుగా ఉంటుందని పుల్లెల గోపిచంద్ పేర్కొన్నారు.

# నాలుగు జిల్లాల్లో భూములు బంగారం

**రంగారెడ్డి :** రీజనల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ అభివృద్ధి వేరే లెవల్కు వెళ్తోందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నగరం చుట్టుపక్కల 4 జిల్లాల్లో అభివృద్ధి వేగంగా జరగనుంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే హైదరాబాద్ సంస్థానం చాలా రిచ్. స్వాతంత్ర్యం వచ్చాక.. భాగ్యనగరంలో వేలాది ఎకరాల ప్రభుత్వ ఆస్తులు ఉండేవి. అప్పటికే దేశంలో ఎక్కడా లేనివిధంగా కట్టడాలు, నిర్మాణాలు హైదరాబాద్లో వెలిశాయి. ఆ తర్వాత కాలక్రమేనా పరిశ్రమల అభివృద్ధి, ఫార్మా రంగం అభివృద్ధి హైదరాబాద్కు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చింది. సైబర్ టవర్స్ నిర్మాణం, ఐటీ ఎగుమతులు హైదరాబాద్ అభివృద్ధి బంగారు బాటలు వేశాయి.ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాయి. తద్వారా నగర అభివృద్ధితో పాటు.. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో.. నగర రూపురేఖలు మారిపోయాయి. గతంలో ఉన్న నగరం కంటే.. దాదాపు 10 నుంచి 15 కిలోమీటర్ల మేర అభివృద్ధి చెందింది.తాజాగా.. రీజనల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ ఆపలేని విధంగా తయారైంది. ముఖ్యంగా రియల్ రంగంలో దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే.. హైదరాబాద్ భూములకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల వారు కూడా హైదరాబాద్ పరిసరాల్లో భూములు కొనుగోలు చేయాలని ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఇటీవల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణమయ్యే 4 నాలుగు జిల్లాల్లో భూములు కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు.రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులు మొత్తం ఐదు ప్యాకేజీల్లో చేపడుతున్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా దీన్ని నిర్మించనున్నారు. ప్రధానంగా ఔటర్ రింగ్ రోడ్డు తోపాటు.. జాతీయ రహదారులు, ఇతర జిల్లా కేంద్రాలకు వెళ్లే మార్గాలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్ఛేంజ్లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 ఇంటర్ఛేంజ్లతో పాటు టోల్ప్లాజాలు, రెస్టరూంలు, సర్వీసు రోడ్లు, బస్బేలు, ట్రక్ బేలు నిర్మించనున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా నిర్మిస్తున్నా.. భవిష్యత్తులో ఆరు, ఎనిమిది వరుసలుగా పెంచుకునే అవకాశం ఉంది.దీంతో ఇప్పుడైతే.. ఈ 4 జిల్లాల పరిధిలో భూముల ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఉత్తరభాగంలో నిర్మించే నాలుగు వరుసల రహదారికి 11 జాతీయ, రాష్ట్ర రహదారులు అనుసంధానం కానున్నాయి. గ్రీన్ఫీల్డ్ రీజినల్ ఎక్స్ప్రెస్వేగా వ్యవహరించే ఈ రహదారికి అనుసంధానంగా ఉండే మార్గాల ద్వారా.. హైదరాబాద్ నగరంతో పాటు నగర శివారులోకి కూడా రాకుండానే నేరుగా ఇతర రాష్ట్రాలకు ప్రయాణం చేయవచ్చు. అందుకే ఈ జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటు, నివాస సముదాయాల కోసం భూముల కోసం ఎక్కుమంది అన్వేషిస్తున్నారు.

రిజనల్ రింగ్ రోడ్డు వినియోగంలోకి వస్తే.. వివిధ జిల్లా కేంద్రాలకు కూడా నేరుగా వెళ్లవచ్చు. అంతర్రాష్ట్ర వాహనాలకు దూరం తగ్గనుంది. ఫలితంగా హైదరాబాద్ ప్రాంత పరిధిలో వీటి తాకిడి తగ్గే అవకాశాలున్నాయి. కనెక్టివిటీ పెరగడంతో ఎకనామిక్ కారిడార్గా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ఈ రహదారితో అనుసంధానమయ్యే జిల్లాల్లోనూ వ్యాపారరంగం మరింత వృద్ధి చెందనుంది. ఇంటర్ఛేంజ్ల వద్ద వివిధ ఆకృతుల్లో రోడ్లను నిర్మించనుండడంతో ఈ ప్రాంత రూపురేఖలు కూడా పూర్తిగా మారిపోనున్నాయి.

# రైతు కూలీల సాయంపై తర్జన భర్జనలు

**వరంగల్ :** భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి 12వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని..ఎన్నికలప్పుడు హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. అధికారంలోకి వచ్చి ఏడాది అయిపోయింది. రేవంత్ ప్రభుత్వం రెండో ఏడాదిలోకి అడుగుపెట్టింది. దీంతో సంక్రాంతి కానుకగా రైతుభరోసా ఇంప్లిమెంట్ చేయాలని భావిస్తున్నారుఅదే సమయంలో భూమి లేని రైతు కూలీలకు ఆర్థిక సాయం అమలుపై రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఒక్క ఎకరా కూడా వ్యవసాయ భూమి లేకుండా, కూలి పనులు చేసుకొని జీవిస్తున్న అత్యంత నిరుపేదలకు ఆర్థిక సాయం చేసే పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో భూమి లేని రైతు కూలీల్లో అర్హులను గుర్తించడం కష్టతరంగా మారిందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.ఇంటింటి సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలో మొత్తం కోటి 16లక్షల కుటుంబాలు ఉన్నాయి. దీంట్లో పట్టాదారు పాసు పుస్తకాలున్న రైతులు 70 లక్షలని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. మిగిలిన 46 లక్షల కుటుంబాలకు భూమి లేదు. వీరిలో నిరుపేదలను గుర్తించేందుకు జాతీయ ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.తెలంగాణలో మొత్తం 53 లక్షల మందికి ఉపాధి హామీ గుర్తింపు కార్డులున్నా, వారిలో 32 లక్షల మంది మాత్రమే రోజూ కూలీ పనులకు వెళ్తున్నట్లు కార్డులు చలామణిలో ఉన్నాయి. ఈ కార్డుదారుల్లో భూమి లేని వారు దాదాపు 21 లక్షల నుంచి 23 లక్షల వరకు ఉండొచ్చని ప్రభుత్వం ప్రాథమిక అంచనాకు వచ్చింది. కానీ వీరిని



మాత్రమే 12వేల రూపాయల ఆర్థిక సాయానికి అర్హులుగా గుర్తిస్తే..మిగతా వారి నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో కనిపిస్తోంది.రైతు కూలీలకు సాయంపై ఏ ప్రాతిపదికన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేయాలన్న దానిపై ప్రభుత్వం దగ్గర ఇంకా క్లారిటీ లేదని తెలుస్తోంది. కొంతమంది ఉపాధి హామీ కూలీలను మాత్రమే రైతు కూలీలని అర్హులుగా గుర్తించి, మిగతా వారిని తప్పిస్తే వారిలో వ్యతిరేకత వస్తుందని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు. దాని ప్రభావం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని అంచనా వేస్తున్నారట.ఒకవేళ ఏ షరతు లేకుండా ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలుగా ఉన్న 46 లక్షల మందికి ఏడాదికి 12 వేల చొప్పున చెల్లిస్తే 5వేల 2వందల కోట్లు అవసరం అవుతాయి. అంటే మొదటి విడతలో 6వేల చొప్పున చెల్లించినా 2వేల 600 కోట్లు కావాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇంత పెద్ద మొత్తంలో నిధులను చెల్లించే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదంటున్నారు అధికారులు.అలా కాదని ఉపాధి హామీ పనులకు వెళ్తున్న 23 లక్షల మందికి 12వేల చొప్పున చెల్లిస్తే 2వేల 7వందల కోట్ల రూపాయలు కావాల్సి ఉంటుంది. అంటే మొదటి విడతలో 6వేలు చెల్లిస్తే 1350 కోట్లు అవసరం. కాబట్టి ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారికి మాత్రమే 12వేల సాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పంటలు పండించే రైతులతో పాటు, పది ఎకరాలలోపు భూములకు మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వాలనే యోచనలో ఉంది రేవంత్ సర్కార్.అయితే రైతు భరోసా, రైతు కూలీలకు సాయంపై కోత పెడితే పబ్లిక్ రెస్పాన్స్ ఎలా ఉంటుందోనని టెన్షన్ పడుతోంది ప్రభుత్వం. ఇప్పటికే రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ప్రతిపక్షం విమర్శిస్తోంది. ఇది కోతల ప్రభుత్వమని ఇప్పటికే అపోజిషన్ అటాక్ చేస్తోంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా, రైతు కూలీలకు సాయంపై కసరత్తు చేయడంలో బిజీగా ఉందట తెలంగాణ ప్రభుత్వం. చూడాలి మరి ప్రభుత్వం గైడ్లైన్స్ రిలీజ్ చేసిన తర్వాత పబ్లిక్ రెస్పాన్స్ ఎలా ఉంటుందో.

## జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే జిల్లాల పర్యటనకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్లాన్ చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లాల్లో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లో పార్టీ నేతలతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ , కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేయనున్నారు.

**పదేళ్లు బీసీలను అణగదొక్కారు: మహేష్కుమార్గౌడ్**

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు మహేష్కుమార్గౌడ్ కౌంటర్ ఇచ్చారు. బీసీల గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్కు లేదని అన్నారు. పదేళ్లు బీసీలను అణగదొక్కి అగ్రవర్ణాలకే అంకితమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల మాటలను ప్రజలు నమ్మరని మహేష్గౌడ్ అన్నారు. బీసీలకు కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తనలాంటి సామాన్య కార్యకర్తకు టీపీసీసీ ఇవ్వడంతో పాటు బీసీల డిపార్ట్మెంట్కు అత్యధిక నిధులు ఇచ్చిందని మహేష్గౌడ్ పేర్కొన్నారు.

## మహానగరంకు సాగర్ నీరు!

-మొదటిపేజీ తరువాయి

జలమండలి ఆదాయ వ్యయాల నివేదికలను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వివరించారు. జలమండలి కొత్త ప్రాజెక్టులకు తక్కువ వడ్డీలతో రుణాలు తెచ్చుకోవాలని సీఎం రేవంత్రెడ్డి సూచించారు. మంజీరా నుంచి పాత పైప్ లైన్ పక్కనే కొత్త పైపులైన్ ప్రాజెక్ట్ పనులు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జల జీవన్ మిషన్ ద్వారా నిధులను తెచ్చుకోవడానికి వీలుగా ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. 25 ఏళ్ల భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ఇంటింటికీ తాగునీటితోపాటు సివరేజ్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. సివరేజ్ ప్లాన్పై కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పేర్కొన్నారు.

## అలా చేస్తే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతాపై రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.రహదారి భద్రతా పోస్టర్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. రవాణా శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఎలక్ట్రిక్ వెహికిల్ చార్జింగ్ స్టేషన్ను ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విశ్వ ప్రసాద్ అడిషనల్ సీపీ ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభం అయ్యాయని చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, ప్రమాదాలు నివారించాలని ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. తెలంగాణలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ రవాణా శాఖ, పోలీస్ శాఖ , విద్యా శాఖ అన్ని రకాల డిపార్ట్మెంట్లు ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని రవాణా శాఖ పక్షాన కోరామన్నారు. రోడ్డు భద్రతపై ఎవరికి వారు అవగాహనతో అమలు చేయాలని చెప్పారు. ప్రజలు చైతన్యం కావాలని.. సామాజికంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాలలో యునిసెఫ్ సహకారంతో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం 500 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ఈ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఏ కార్యక్రమం అయినా చిన్నప్పుడు నేర్చుకున్నది పెద్దయిన తర్వాత ఉపయోగపడుతుందని అన్నారు. ట్రాఫిక్ రూల్స్పై సిలబస్లో మరింతంగా ఫోకస్ పెట్టేలా క్యాబినెట్లో మాట్లాడతామని తెలిపారు. బయటకు వెళ్లినప్పుడు బాధితులతో ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## టీజీఎస్పీలో బాక్సింగ్, క్రికెట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటు : డీజీపీ జితేందర్



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగంలో ఉత్తమ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ కేంద్రాలను నెలకొల్పాలని యోచిస్తున్నట్లు డీజీపీ జితేందర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్పీ బెటాలియన్లలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. హైదరాబాద్లోని యూసుఫ్గూడ మొదటి బెటాలియన్లో డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ%%. అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ క్రీడలలో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని చాటి చెప్పిన బాక్సర్ నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ క్రికెటర్లు ప్రస్తుతం టీజీఎస్పీ డీఎస్పీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. వారి ఆధ్వర్యంలో నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు టీజీఎస్పీ విభాగంలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. టీజీఎస్పీ సిబ్బందికి శాంతి భద్రతల పరిరక్షణలోనూ, ఇతర రాష్ట్రాలకు వెళ్లి సేవలు చేసినందున వారికి ఎంతో పేరు ఉందన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ సిబ్బందిని మాదకద్రవ్యాలను అరికట్టేందుకు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు కూడా వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4077 మంది టీజీఎస్పీ కానిస్టేబుల్లకు శిక్షణ ఇచ్చామని, యూసుఫ్గూడ బెటాలియన్లో 548 మందికి శిక్షణ పూర్తయిందని తెలిపారు. భారీ స్థాయిలో టీజీఎస్పీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈ రోజు నుంచి పోలీస్ విభాగంలో చేరుతున్న సిబ్బంది వారి తల్లిదండ్రులు గర్వపడేలా, రాష్ట్ర పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేయాలని డీజీపీ కోరారు. టీజీఎస్పీ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న 4077 కానిస్టేబుల్లలో 2746 గ్రాడ్యుయేట్స్ , 596 పోస్ట్ గ్రాడ్యుయేట్స్, 62 మంది ఎక్స్ సర్వీస్మెన్లు ఉన్నారని తెలిపారు.

## సంపాదకీయం

# తేరుకుంటున్న సిరియా

సిరియన్లలో అత్యధికులు సున్నీలు కాగా, షియాలు, కుర్దులకు సంబంధించి సమస్యలు తేలికగా పరిష్కారం కాకపోవచ్చు. అస్సాద్ షియా తెగకు చెందినవాడు. కనుక తమపై కక్ష సాధింపు చర్యలు ఉండవచ్చుననే భయంతో అస్సాద్ చెందిన అలావీ షియాలు, ఇతర షియాలు దేశం వదిలి పారిపోతున్నట్లు వార్తలు చెప్తున్నాయి. కనుక వారికి భరోసా కల్పించవలసి ఉంటుంది. మరొక వైపు ఈశాన్య ప్రాంతంలో విస్తారంగా గల కుర్దులను అమెరికా తన పలుకుబడితో ఉంచుకొనగా, వారితోపాటు తమ దేశంలోని కుర్దులు కలిసి టర్కీ సమగ్రతకు ముప్పు తెస్తున్నట్లు భావించే టర్కీ, రెండు వైపుల గల కుర్దులనూ అణచివేయజూస్తున్నది. సిరియాతో పాటు కుర్దులు, అమెరికా, టర్కీలను మధ్య రాజీ కుదిరితే తప్ప ఈ సమస్య తేలదు. అందువల్ల ఈ విషయం తగినంత సమయం తీసుకోవచ్చు. సిరియా కొత్త నాయ కత్వం ఎదుట గల మరొక రెండు సమస్యలు రష్యా, ఇరాన్‌తో ఎట్లా వ్యవహారిం చటమన్నది ఒకటైతే, ఇటీవలి పరిణామాలను అనువుగా చేసుకుంటున్న ఇజ్రా యెల్, సిరియాకు చెందిన గోలన్ కనుమల ప్రాంతాన్ని మరింతగా ఆక్రమించు కుంటూ తామిక అక్కడి నుంచి ఖాళీ చేయబోమని బాహాటంగా ప్రకటించటం. నియంత అస్సాద్‌ను కూలదోసి ఈ నెల 8కి నెల రోజులు పూర్తి చేసుకోనున్న సిరియా మొదట భావించిన దాని కన్నా వేగంగా కుదుటపడుతుండటం గమనించదగ్గది. ఈ పరిణామం కొత్త ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకే గాక మొత్తం పశ్చిమాసియాకు, ప్రపంచానికి కూడా సంతోషించవలసిన విషయమవుతున్నది. దీని అర్థం సిరియా ఎదుట గల సమస్యలన్నీ పరిష్కారం అయిపోయాయనో, ఆ పని త్వరగా జరిగిపోతుందనో కాదు. సమస్యలు తీవ్రమైనవి. అవి పరిష్కారం అయ్యేందుకు తగినంత సమయం అవసరం. బహుశా చాలా కాలమే తీసుకోవచ్చు. కాని, కొత్త నాయకత్వం తీసుకుంటున్న వైఖరి, అందుకు అనుగుణంగా చెప్తున్న మాటలు, చేస్తున్న చర్యలు మాత్రం ఆశాభావాన్ని కలిగిస్తున్నాయి. అన్నింటి కన్నా ముందు గమనించవలసిన విషయాలు కొన్నున్నాయి. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన హయాత్ తహరీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) గ్రూపు అధినేత అబూ మొహమ్మద్ అల్ జూలానీ తన ఈ విధమైన అజ్ఞాత యుద్ధ కాలపు మారు పేరును, తిరుగుబాటు విజయవంతమైన మరునాడే వదలుకుని, తన అసలు పేరు అహమద్ అల్ షరాకు వెంటనే మార్చుకున్నాడు. దేశంలోని అందరు ప్రజలు ఒకటేనని, తాము అన్ని జాతులు, తెగలు, మతాలు, వర్గాలకు ఒకటి చేసి అందరి మేలు కోసం పరిపాలించగలమని అదే రోజు ప్రకటించాడు. మహిళలపై ఎటువంటి వివక్ష ఉండదని కూడా స్పష్టం చేశాడు. ఈ కొద్ది పాటి మాటలతోనే ఆయనను సిరియన్ ప్రజలతోపాటు ప్రపంచంలో అనేకులు కొత్త దృష్టితో చూడటం మొదలైంది. ఆ విధంగా ఒక్క రోజులోనే సానుకూల దృష్టిని సంపాదించుకున్న అహమద్ అల్ షరా, అప్పటి నుంచి ఈ సరికి 25 రోజులు గడిచిన కాలంలోనూ అదే విధమైన వైఖరిని కొనసాగించాడు. ఆయనకు, హెచ్‌టిఎస్‌కు వారు 13 సంవత్సరాల క్రితం తిరుగుబాటు ప్రారంభించినపుడు ఐక్యరాజ్య సమితి, అమెరికా శిబిరంతోపాటు అనేక దేశాలు టెర్రరిస్టు ముద్ర వేశాయి. అందుకు తగినట్లు ఆ సంస్థకు అల్ కాయెదా, ఐఎస్ఐఎస్ వంటి సంస్థలతో ప్రత్యక్ష సంబంధాలుండేవి. అహమద్ షరాపై అమెరికా కోటి డాలర్ల బహుమతి కూడా ప్రకటించింది. సిరియా ఈశాన్య ప్రాంతంలోని కుర్దులను పోటీ దళాలుగా తయారు చేసి అన్ని విధాలుగా సహాయం చేసింది. టర్కీ తన గ్రూపును తాను నిర్మించింది. అస్సాద్ షియా అయినందున అరబ్ రాజ్యాలు సున్నీ గ్రూపులకు సహాయం చేశాయి. అస్సాద్ కాలంలో మరి కొన్ని తిరుగుబాటు గ్రూపులు ఏర్పడ్డాయి. ఇటువంటి అల్లకల్లోలపు పరిస్థితుల మధ్య ఇంచుమించు ఒక్క చేతితో అస్సాద్‌ను కూలదోసిన అహమద్ షరా, ఈ గ్రూపులన్నింటిని ఒకటి చేయచూడటం పెద్ద సవాలుగా మారింది. అదే విధంగా తమకు గల టెర్రరిస్టు ముద్రను తొలగింపజేసుకోవటం. ముందు గా ఇవి జరిగితే గాని, అస్సాద్ కాలంలో సిరియాపై ఐక్యరాజ్య సమితితో పాటు అమెరికా తదితర దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలు పోవటానికి, ఆ దరిమిలా దేశాభివృద్ధి కోసం చర్యలకు అవకాశం వుండదు. ఈ పాతిక రోజులుగా కొత్త నాయకుడు చేస్తూ వస్తున్నది అదే. తమ పట్ల సిరియన్లకు, బయటివారికి విశ్వాసం ఏర్పడేందుకు వెంటనే ఖైదీలందరినీ విడుదల చేయించాడు. మహిళల వస్త్రధారణ, విద్యాభ్యాసంపై ఆంక్షలు రద్దు చేశాడు. వివిధ రకాల పౌర స్వేచ్ఛలను పునరుద్ధరింప చేశాడు. అస్సాద్‌కు పూర్తి మద్దతుగా ఉండిన రష్యా, ఇరాన్‌లతో సహా అన్ని దేశాలతో సత్సంబంధాలు ఉండగలవని ప్రకటించాడు. ఈ పనులు చేస్తూ, సిరియాపై, వ్యక్తిగతంగా తనపై గల ఆంక్షలు ఎత్తివేయవలసిందిగా అందరినీ కోరాడు. సిరియా భౌగోళికంగా కీలక ప్రదేశంలో ఉంది. అందువల్ల పైన పేర్కొన్న ప్రకటనలు, చర్యలను గమనించటంతో అరబ్ రాజ్యాలు, పాశ్చాత్య దేశాలు తమ రాయబార కార్యాలయాలను ఒకదాని వెంట ఒకటి వేగంగా తెరిచాయి. వివిధ దేశాల దౌత్యప్రతినిధులు డమాస్కస్‌కు చేరి అహమద్ షరాతో సమావేశమయారు. అమెరికా ప్రతినిధి బృందం సైతం ఆయనను కలవటమే గాక తనపై గల కోటి డాలర్ల రివార్డును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం టెర్రరిస్టు ముద్ర కూడా తొలగిపోయింది. ఈ సానుకూల పరిణామాలన్నీ ఇంత త్వరగా చోటు చేసుకోవటం సాధారణ విషయం కాదు. ఒకవైపు ఇవి జరుగుతుండగానే మరొక వైపు అహమద్ షరా, దేశంలోని అన్ని గ్రూపులను సమావేశపరచి, అన్ని ఒకటిగా విలీనం కావాలని, కొత్త సిరియా సైన్యంగా రూపొందాలని కోరాడు. అందుకు దాదాపు అన్ని గ్రూపులు అంగీకరించటం మారుతున్న పరిస్థితులను సూచిస్తున్నది. తమ హెచ్‌టిఎస్ గ్రూపును కూడా రద్దు చేయనున్నట్లు ఆయన అదే సమావేశంలో ప్రకటించాడు. ఈ క్రమం రానున్న కాలం లో పూర్తి కాగలదని భావించవచ్చు. అయితే, ఈ క్రమానికి సంబంధించి రెండు చిక్కు సమస్యలు కూడా ఉన్నాయి. సిరియన్లలో అత్యధికులు సున్నీలు కాగా, షియాలు, కుర్దులకు సంబంధించి సమస్యలు తేలికగా పరిష్కారం కాకపోవచ్చు. అస్సాద్ షియా తెగకు చెందినవాడు. కనుక తమపై కక్ష సాధింపు చర్యలు ఉండవచ్చుననే భయంతో అస్సాద్ చెందిన అలావీ షియాలు, ఇతర షియాలు దేశం వదిలి పారిపోతున్నట్లు వార్తలు చెప్తున్నాయి. కనుక వారికి భరోసా కల్పించవలసి ఉంటుంది. మరొక వైపు ఈశాన్య ప్రాంతంలో విస్తారంగా గల కుర్దులను అమెరికా తన పలుకుబడితో ఉంచుకొనగా, వారితోపాటు తమ దేశంలోని కుర్దులు కలిసి టర్కీ సమగ్రతకు ముప్పు తెస్తున్నట్లు భావించే టర్కీ, రెండు వైపుల గల కుర్దులనూ అణచివేయజూస్తున్నది. సిరియాతోపాటు కుర్దులు, అమెరికా, టర్కీలను మధ్య రాజీ కుదిరితే తప్ప ఈ సమస్య తేలదు. అందువల్ల ఈ విషయం తగినంత సమయం తీసుకోవచ్చు. సిరియా కొత్త నాయకత్వం ఎదుట గల మరొక రెండు సమస్యలు రష్యా, ఇరాన్‌తో ఎట్లా వ్యవహరించటమన్నది ఒకటైతే, ఇటీవలి పరిణామాలను అనువుగా చేసుకుంటున్న ఇజ్రాయెల్, సిరియాకు చెందిన గోలన్ కనుమల ప్రాంతాన్ని మరింతగా ఆక్రమించుకుంటూ తామిక అక్కడి నుంచి ఖాళీ చేయబోమని బాహాటంగా ప్రకటించటం. అదే విధంగా సిరియన్ సైనిక కేంద్రాలు, ఆయుధాగారాలపై వందలాది దాడులు జరుపుతూ వారి బలాన్ని ధ్వంసం చేయటమే లక్షమని చెప్తూ, సిరియా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించటం. ఇది తగదని ఐక్యరాజ్యసమితితో పాటు యూరోపియన్ దేశాలు ఖండించినా లెక్కచేయకపోవటం. సిరియా కొత్త ప్రభుత్వం ఈ చర్యలను ఎదుర్కొనే శక్తి లేక సాధారణ నిరసనలకు పరిమితమవుతున్నది. ఇది చివరకు ఏ విధంగా పరిణమించవచ్చునన్నది పెద్ద సవాలే. పోతే, అస్సాద్‌కు మద్దతునిచ్చిన రష్యాకు సిరియాలో మధ్యధరా సముద్ర తీరాన టార్టస్ వద్ద ఒక నౌకాస్థావరం, హెమెయితిమ్ వద్ద ఒక వైమానిక స్థావరం ఉన్నాయి. వాటిని మూసివేయవలసిందిగా కొత్త ప్రభుత్వం ఏమీ ఆదేశించలేదు గాని, రష్యా మాత్రం తన యుద్ధ విమానాలను మరొక మధ్యధరా సముద్ర తీర దేశమైన లిబియాకు తరలించటం మొదలుపెట్టింది. చివరకు ఏమి జరిగేదీ వేచిచూడవలసిన విషయం. కొత్త ప్రభుత్వంతో సంబంధాల కోసం ఇరాన్ ఆరంభించిన ప్రయత్నాలు ఏమయేదీ కూడా కొంత కాలానికి గాని స్పష్టత రాదు. చివరకు మిగిలే దీర్ఘకాలిక సమస్య ఆర్థికాభివృద్ధి, పేదరికం తగ్గింపు. సిరియాలో గల సహజ వనరులు ఇంత కాలం సరిగా వినియోగానికి రాకపోవటమో, దోపిడీకి గురి కావటమో జరిగింది. దేశంలో 80 శాతం పేదరికం ఉన్నట్లు అంచనా. ఈ పరిస్థితులు మారుటానికి అరబ్ దేశాలు, పాశ్చాత్య కూటమి తగు సహాయం దీర్ఘ కాలం పాటు చేస్తూపోవటంతో పాటు కొత్త ప్రభుత్వం సమర్థవంతంగా పాలించవలసి ఉంటుంది. అహమద్ షరా సూచించినట్లు రాజ్యాంగ రచన, ఎన్నికల నిర్వహణకు నాలుగేళ్ళుపట్టినా, ఈలోగా ఆయన ఇంత వరకు చూపిన వేగాన్నే పరిపాలనలోనూ చూపవలసి ఉంటుంది.

# సాటిలేని మేటి చిత్రకారుడు



పాకాల తిరుమల్ రెడ్డి అంటే చాలామందికి తెలియక పోవచ్చు.. కాని. పి.టి.రెడ్డి అంటే చిత్రకళా ప్రపంచంలో తెలియనివారు బహుశా ఉండరేమో. పాకాల తిరుమల్ రెడ్డి (జనవరి 4, 1915 – అక్టోబర్ 21, 1996) చిత్రకళా రంగంలో పి.టి.రెడ్డి గా చిరపరిచితుడు. అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన చిత్రకారుల్లో పి.టి.రెడ్డి ముఖ్యుడు. ఆరు దశాబ్దాలుగా చిత్రకళా రంగంలో అలుపెరుగని కృషి చేసిన గొప్ప చిత్రకారుడు ఆయన. మరణించే వరకు కుంచెలను విశ్రాంతి ఈయని తెలంగాణ గర్వించ దగిన చిత్ర కారుడు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం అమృతా షేర్గిల్, రవీంద్రనాథ్ ఠాగూర్లతో సమానంగా ప్రథమశ్రేణి చిత్రకారుడుగా గుర్తింపు పొందిన పి.టి.రెడ్డి భారతీయ చిత్రకళా రంగంలో ప్రథమశ్రేణి చిత్ర కారుడుగానే గుర్తింపు కలిగి ఉన్నాడు. చిత్ర శిల్పకళలో తన జీవిత సర్వస్వం ధారపోసిన నిత్యకృషీ వలు డాయన. సుమారు ఐదున్నర దశాబ్దాల కళాజీవితపు వెలుగు నీడలలో తనను ప్రభావితం చేసిన అనేక సమకాలీన సంఘటనలకు తన చిత్రాలతో ప్రాణంపోసిన కళాకారుడు పి.టి. రెడ్డి. అన్ని తరగతుల ప్రేక్షకుల కళాభిజ్ఞతకు అనుగుణంగా చిత్రాలను, శిల్పాలను సృజించాడు. వాటిలోని మంచి చెడులను, తారతమ్య వివక్షతతో వీక్షించి, తెలుగు జీవితానికి అన్వయించే రీతిలో రంగుల మేలు కలయికతో, రమణీ యతను, సృజనాత్మకతను సమా నంగా మేళవించిన మేటి చిత్రకా రుడు పి.టి.రెడ్డి. నిత్య జీవితంలో తారసపడే అనేక సంఘటనల ఆధారంగా వేసిన చిత్రాలను, గ్రామీణ జీవితానికి అద్దంపట్టే చిత్రాలుగా రూపొందిం చడం ఆయన ప్రత్యేకత. ప్రత్యేక తెలంగాణ పోరాటం సుదీర్ఘంగా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయన గీసిన చిత్రాలు ప్రశంసనీయమైనవి. కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామంలో 1915, జనవరి 4 న జన్మించాడు. 1942లో బొంబాయి సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి చిత్రకళల మొదటి ర్యాంకుతో డిప్లొమా పొందాడు. దేశంలోని అన్ని ముఖ్య పట్టణాల లోన కాక ఆస్ట్రేలియా, యు.కె, జపాన్, పశ్చిమ జర్మనీ తదితర విదేశాల్లో సైతం చిత్రకళా ప్రదర్శనలు నిర్వ హించాడు. తనతో భావ సారూ ప్యత కలిగిన నాటి యువ చిత్ర కారులు మాజిద్, ఎం. ఏ. భోస్లే, బాప్తిస్టా, ఎం.వి, కులకర్ణిలతో కలిసి “ది కాంటెంపరరీ గ్రూప్ ఆఫ్ పైంటర్స్” అనే సంస్థను కూడా స్థాపించి నిరంతరం చిత్రకళా కార్యక్రమాలను నిర్వహించేవాడు. పి.టి.రెడ్డి అనేక పదవులు కూడా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన చిత్రకారుడుగా ఆయన చేసిన సేవలు చెప్పుకోదగినవి. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ విశిష్ట సభ్యునిగా, కార్యదర్శిగా, అధ్యక్షు డిగా అనేక హోదాల్లో పని చేసాడు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లెన్నో అందు కున్నాడు. హైదరా బాదు నారాయణగూడలోని తన నివాసాన్ని ఒక పెద్ద చిత్రకళా ప్రదర్శనా నిలయంగా తీర్చిదిద్దిన కళా దర్శకుడు పి.టి.రెడ్డి.జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో ప్రదర్శనలలో పి.టి.రెడ్డి చిత్రాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ప్రముఖంగా బకింగ్ హాం పేలస్, లండన్, న్యూఢిల్లీ నందలి రాష్ట్రపతి భవన్, ఎంబసీ ఆఫ్ జి.డి.ఆర్., పార్లమెంట్ హౌస్ ఇంకా ఢిల్లి కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, నేషనల్ గేలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్,కేంద్ర లలితకళా అకాడమీ న్యూఢిల్లి, కర్నాటక, కాశ్మీర్, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీలతో పాటు జే.జే. స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ బొంబాయి, అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కలకత్తా, హైదరాబాద్ స్టేట్ మ్యూజియం, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హైదరాబాద్, సాలార్ జంగ్ మ్యూజియం, ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్అండ్ క్రాఫ్ట్స్. న్యూఢిల్లి, టాటా ఇన్స్టి ట్యూట్ ఆఫ్ పండమెంటల్ రీసర్చ్ బొంబాయి మరికొన్ని యునైటెడ్ కింగ్‌డం, అమెరికా, యుగోస్లో వియా, ఫిలిపీన్స్, ఫ్రాన్స్, స్విడ్జ ర్లాండ్, జర్మనీ ఆస్ట్రేలియా తదితర దేశాలనందు వివిధ ప్రైవేట్ వ్యక్తుల సేకరణలో కూడా ఆయన చిత్రాలు వున్నాయి. కళ ప్రజల కోసం అని భావించి, ఎనభై ఏళ్ళ ప్రస్థానంలో అనితర సాధ్య మైన కృషి, పట్టుదలతో తెలుగు చిత్రకళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన అసమాన ప్రతిభాశాలి 1996, అక్టోబర్ 21న మరణించాడు. పి.టి.రెడ్డి భార్య ప్రముఖ రచయిత్రి పి.యశోదారెడ్డి. పి.టి.రెడ్డిని 1947లో ప్రేమ వివా హం చేసుకున్న ఆమె, తిరు మల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. ఆమె కూడా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరిం చేది. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటి లోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించగలిగేది. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

# విశ్వరహస్యాల ఆవిష్కర్త

అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన “సర్ ఐజాక్ న్యూటన్” ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను “సైన్సు పితామహుడు”గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వవిద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచేవారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీ లో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారుచేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, %టశ్రీబఇఅశీఅం% యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు – ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమి తులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి. (1).మొదటి సూత్రము... “బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది”. ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము... “ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది”. (3).న్యూటన్ మూడవ నియమం...”చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును”. భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ “ప్రిన్సిపియా మేథమేటికా” అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా “దృశాశాస్త్రం” పుట్టింది. మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు.ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం “సర్” అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ “సర్ ఐజాక్ న్యూటన్”గా పేరెన్నిక గన్నారు.తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

# అంధుల ఆశాదీపం

జనవరి 4ను వరల్డ్ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటారు. అంధులకు చదువుకొనే అవకాశాన్ని కల్పించిన బ్రెయిలీ జననం మరణం రెండూ రెండు రోజుల తేడాతో జనవరి 4, జనవరి 6న జరుపుకుంటారు. కంటి చూపు లేకపోయినా..ముందు చూపు ఉన్న వ్యక్తి లూయీ బ్రెయిలీ. బ్రెయిలీ కనిపెట్టిన అంధుల లిపి ప్రస్తుతమున్న కంప్యూటర్ భాషకు వీలుగా రూపొందించ బడిందంటే ఆయన ముందుచూపు ఏమిటో అర్థమవుతుంది. బ్రెయిలీ, పేపర్ మీద ఎత్తు చుక్కల ఆధారంగా ఒక భాష రూపొందించారు. ఈ చుక్కలను స్పర్శించడం ద్వారా కనిపించక పోయినప్పటికీ ఏదైనా చదువవచ్చు. ఈ లిపి చూపు లేని వారికి రాయటంతో పాటు చదవడంకు కూడా సహాయ పడుతుంది. ప్రపంచ అంధులకు జ్ఞాన నేత్రాలను ప్రసాదించిన మహనీయుడు లూయీ బ్రెయిలీ. మానిక్ బారన్, సైమన్ రెనా బ్రెయిలీ దంపతులకు లూయీ బ్రెయిలీ 1809 జనవరి 4న పారిస్ లోని క్రూవే గ్రామంలో జన్మించారు. బాల్యంలోనే ప్రమాదవశాత్తు రెండు కళ్ళను కోల్పోయారు. పారిస్‌లో 1784లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలకు బ్రెయిల్ చదువు కోవడానికి వెళ్ళారు. బ్రెయిల్ అసాధారణ ప్రతిభ సామర్థ్యాలు గల వ్యక్తిగా రాణించి, అప్పటికి అమలులో ఉన్న “లైన్ టైపు” పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమించబడ్డారు. పగలు విద్యార్థులకు బోధిస్తూ, రాత్రులు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీ కోసం అసాధారణ ప్రతిభ కలిగిన వ్యక్తిగా విశేష కృషి చేశారు. అందు కోసం ఒక ప్రత్యేక లిపిని కనుగొని దానికి “బ్రెయిలీ లిపి” అని నామకరణం చేశారు. అంధులు తేలికగా చదవగలిగే రాయగలిగే లిపిని తయారు చేయడానికి కృషి చేశారు. అంధులకు పుస్తకాలు ప్రింటుచేయడానికి అంతవరకు ఉన్న విధానాలు బ్రెయిలుకు లోపభూయిష్టంగా కనబడ్డాయి. అంధులకు చూసే అవకాశం లేదు. కనుక ఆ ప్రింటింగు విధానం స్పర్శపై ఎక్కువగా ఆధారపడి వుండాలని గ్రహించారు. ఆ అక్షరాలు నున్నగా కాకుండా చుక్కలు చుక్కలుగా వుండాలని భావించారు. ఒక గీతగా కాకుండా, చుక్కలు చుక్కలుగా వుంటే చదవటం తేలిక అని బ్రెయిల్ నిశ్చయానికి వచ్చారు. 1821 లో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి, తన సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు 12 ఉబ్బెత్తు చుక్కలతో సంకేత లిపిని తయారు చేసారు. దీని గురించి తెలుసుకున్న బ్రెయిలీ 12 చుక్కలను ఆరు చుక్కలకు తగ్గించి అవసరమైన రీతిలో వాటిని పేర్చుతూ అక్షరాలను, పదాలను అంకెలను, సంగీత చిహ్నాలను రూపొందించారు. 20 సంవత్సరాల యువకుడైన బ్రెయిల్ తన నూతన పద్ధతి సిద్ధాంతీకరించాడు.

# మూడు కేటగిరీలుగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

**మంత్రి పొంగులేటికి నివేదిక అందజేసిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**



**వాస్తవ నేస్తం,హైదరాబాద్ :** రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు మూడు కేటగిరీలుగా అక్రిడి టేషన్లు ఇవ్వాలని అక్రిడిటేషన్స్ గైడ్ లైన్స్ పై ఏర్పాటు అయిన కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ రిపోర్ట్ ను సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ హరీశ్ ఆధ్వర్యంలో సచివాలయంలో అందజేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని కమిషనర్ ను మంత్రి పొంగులేటి ఆదేశించారు. వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడి టేషన్ల జారీకి ప్రస్తుత గైడ్ లైన్స్‌ను పరిశీలించి, కొత్త గైడ్ లైన్స్ ఖరారు చేయడానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చైర్మన్‌గా, కమిషనర్ హరీశ్ మెంబర్ కన్వీనర్‌గా గత అక్టోబర్‌లో సమాచార శాఖ కమిటీ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి కమిటీ పలు మార్లు సమావేశమై, తాజా గైడ్ లైన్స్ రూపొందించింది. ఈ కమిటీలో ఎమ్మెల్సీ అమీర్ ఆలీ ఖాన్, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ శ్రీనివాస్, వీ 6 న్యూస్ సీఈవో అంకం రవి, హిందూ పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫొటో గ్రాఫర్ నరహరి ఉన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి



**వాస్తవ నేస్తం,తలమడుగు:** అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని తలమడుగు రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం పత్రిక సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల రైతులు మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల వరకు పూర్తిస్థాయి రుణమాఫీ అవ్వకముందే ప్రభుత్వం వంద శాతం రుణమాఫీ పూర్తి అయిందని, చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల్లో రైతులు దిగుబడులు రాక అప్పుల పాలు అవ్వడం జరిగిందని, రుణమాఫీ వస్తేనైనా పంట పెట్టుబడులు వివిధ ఖర్చులు తీరి అప్పుల బాధ తీరుతుందని ఏడాదికాలంగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు, ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే రోజులలో రైతుల కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కాడేశీను, పద్మాకర్ రెడ్డి, కటకం దేవన్న, శేవ్వగంగారెడ్డి, ఎడిమెల స్వామి రెడ్డి, నర్సింలు, నడిపి ఉషన్న, స్వామి, ప్రేమేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షునికి సన్మానం



**వాస్తవ నేస్తం,తలమడుగు:** మండల కాంగ్రెస్ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా లింగంపేల్లి గణేష్ ఎన్నికైన సందర్భంగా పార్టీ నాయకులు గ్రామస్తులు ఆధ్వర్యంలో సుంకిడి గ్రామంలో పార్టీ కార్యకర్తలు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతుందని యువకులు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ పార్టీ నీ మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్ట్ శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, సుభాష్, వినాయక్ రెడ్డి, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఐఈఓ రవీందర్ కుమార్



**వాస్తవ నేస్తం,తలమడుగు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డిఐఈఓ రవీందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థుల హాజరును పరిశీలించారు. కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అదే విధంగా పరీక్ష ఫలితాలు, వార్షిక ప్రణాళిక,90 రోజుల ప్రణాళిక ఎంసెట్,నిట్, పోటీ పరీక్షల పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదువుకొని మంచి ప్రణాళిక ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, మురళి అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# కన్నుల పండువగా లింగాపూర్ జగదాంబ దేవి జాతర

## చారిత్రకు నిదర్శనంగా నిలిచే కొమరంభీం జిల్లా

లింగాపూర్ మండల కేంద్రంలో లంబాడీ గిరిజనుల ఆరాధ్య దేవత అయిన మాతా జగదాంబ దేవి జాతర పూజ ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం గ్రామంలోని జగదాంబ దేవి ఆలయంలో ఆలయ పూజారి రామావత్ మంగులాల్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు తమ సాంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేస్తూ, భక్తి, శ్రద్ధలతో దేవుని సన్నిధిలో భజన పాటలు పాడుతుంటే ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఇందుకు తగ్గట్లుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు శాఖ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవి భక్తుడు. జగజ్జనని మాతా జగదాంబ దేవి చల్లని చూపులతో భక్తుల కోర్కెలు తీర్చే శక్తి స్వరూపిణిగా పూజలు అందుకుంటోంది. జగదాంబ దేవి ధైర్యానికి, శక్తికీ,తెజస్సుకు ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఆమెను దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అత్యంత శక్తిమంతమైన అమ్మ జగదాంబ దేవికి లంబాడీ గిరిజనులు మంగళవారం రోజున జంతు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.
విశేష పూజలు జరిగే ఈ ఆలయాన్ని జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది దర్శించుకుంటారు.



**స్థలపురాణం..**

స్థలపురాణం ప్రకారంగా లింగాపూర్ తాండ వాసులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారట. ఒక రోజు మధ్యాహ్నం సమయంలో అనుకోకుండా ఒక్కేసారి గ్రామమంతా మంటలు చెలరేగి వారు నివాసం ఉండే పురి గుడిసెలకు అంటున్నాయట . మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందట.మంటలు క్షణాల్లో ఒక ఇంటి నుండి మరో ఇంటికి వ్యాపించడంతో తాండ మొత్తం కాలిపొయి ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమైందట. ఇలా ఎండాకాలం వస్తే ప్రతి ఏటా ఈవిధంగా తాండలో ఉన్న పురి గుడిసెలు మంటలకు కాలి బూడిద కావడం ,నిరుపేద గిరిజన కుటుంబాల అస్థి పాస్తులకు నష్టం వాటిల్లేదట. తాండలో నివాసం ఉండే ప్రజలు కూడా వివిధ రకాల వ్యాధులు సోకి చనిపోయే వారట . ఈ విధంగా వరుస సంఘటనలు చోటు చేసుకోవడంతో భయబ్రాంతులకు గురి అయిన తాండ వాసులు తాండ నుండి కొందరు వలస వెళ్ళడంతో అలోచించన తాండ పెద్దలు 1974 లో బంజారాల కాశీ పోహ్రాదేవి పీఠాధిపతి అయిన నిర్గుణ నిరాకారి, బాల బ్రహ్మచారి సంత్ రామారావు మహారాజ్ వద్దకు వెళ్ళి విన్నవించారట.అప్పుడు సంత్ రామారావు మహారాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ తాలుకాలోని లింగాపూర్ గ్రామాని సందర్శించి, తాండ వాసుల్లో మనోధైర్యం నింపి గ్రామస్థులతో ఒక మాట అన్నారట.మీ తాండ కుడి వైపు ఉన్న విశాలమైన స్థలంలో ఒక ఆవు తన బిడ్డకు పాలు ఇస్తుంది.ఆదే స్థలం గుడి నిర్మాణం కోసం పరిశీలించాలని చెప్పడంతో వారు వేళ్ళి చూసే సరికి నిజంగా ఆవు తన దూడకు పాలు ఇస్తుందట.ఆదే చోట స్వయానా మహారాజ్ తన కరకమలంతో జగన్మాత అయిన జగదాంబ దేవికి పూజలు చేసి కొబ్బరి కాయ కొట్టి జాతర ప్రారంభించారట అప్పుటి నుండి గ్రామస్థులు జగదాంబ దేవి పురి గుడిసెలతో ఆలయం నిర్మించి, పూజలు చేయడంతో తాండ వాసుల కష్టాలు తొలగిపోయి, సుఖసంతోషాలతో జీవించడం ప్రారంభించారట. ఇలా ఆనందంగా జీవిస్తూ అందరూ చేయి చేయి కలిపి ఇటుకలు సిమెంట్ తో గుడి నిర్మాణం గావించి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా పుష్య మాసంలో జగదాంబ దేవి జాతర నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది.

**పూజలు..**

చారిత్రక నేపథ్యం కలిగిన మాతా జగదాంబ దేవి అమ్మవారి జాతర ఉత్సవాలు మాఘ మాసం ముగింపు పుష్యమాసం ఆరంభంలో వైభవంగా నిర్వహిస్తారు. మహిళలు అధిక సంఖ్యలో సాంప్రదాయ దుస్తుల్లో జల కళసం తీసుకుని రాగా, తాండ పెద్దలు భజనలు కీర్తనలు చేస్తూ, భక్తి శ్రద్ధలతో ఆలయానికి చేరుకుంటారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవి భజన కీర్తనలతో ఆ ప్రాంతం మారుమోగుతోంది. మహిళలు తమ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ముందుకు సాగుతూ సాయింత్రం ఐదు గంటల ప్రాంతంలో జగదాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.ఆలయ పుజారి రామావత్ మంగులాల్ మహారాజ్ తాండ నాయకుల చేతుల మీదుగా అమ్మవారికి మహాపూజ, హారతి భోగ్ భండారో నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వితరణ చేసి జాతర ప్రారంభిస్తారు.అనంతరం ఆలయానికి భక్తులు తాకిడి ప్రారంభమవుతుంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో చేరుకొని అమ్మ వారికి దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు.

**జాతర ఉత్సవాలు..**

ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య మాసంలో రెండు వారాల పాటు వైభవంగా జాతర కొనసాగుతుంది. ఈ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. జాతరలో తినుబండారాలు, మిఠాయి దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్, చిన్న పిల్లల ఆటవస్తువులు బోమ్మలు, గాజుల దుకాణాలు, కుంకుమ దుకాణాలు , బంజారా సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలు, తదితర దుకాణాలతో పాటు హెూటళ్ళు,మెస్ లు, ఫాస్ ఫుడ్ సెంటర్లు, మినీ వాటర్ ట్యాంకులు , విద్యుత్ సౌకర్యం సంబంధించిన శాఖా వారి అధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు.
జాతరలో కబడ్డీ, వాలీబాల్, కుస్తీ పోటీలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. పోలీసులు శాఖ వారి ఆధ్వర్యంలో జాతరలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

**భజన కీర్తన కార్యక్రమాలు..**

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతి రోజూ సాయంత్రం సమయంలో భజన, కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా భజన, కీర్తనలు చేసే గాయకులకు ఆహ్వానించి భక్తి పాటలు , రామాయణం మహాభారతం కథల కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తి పాటలు వినడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని సమాజం చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని భజన కీర్తనలు ద్వారా గాయకులు శ్రోతలకు హితబోధ చేస్తారు.గాయకులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి బహుమతులు ప్రదానం చేస్తారు.

**దహీ హండీ వేడుకలు..**

జాతర చివరి రోజు ముగింపు సందర్భంగా పుష్య పౌర్ణమి రోజున అత్యంత గొప్ప దహీ హండీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

**ఎలా చేరుకోవచ్చు..**

ఈ జగదాంబ దేవి జాతరకు వచ్చే భక్తులు బస్సులో ఆదిలాబాదు ,నిర్మల్, మంచిర్యాల జిల్లాల నుంచి వచ్చే భక్తులు ముందుగా కొమరంభీం జిల్లా జైనూర్ మండలానికి చేరుకోవాలి. జైనూర్ నుండి లింగాపూర్ మండల కేంద్రము సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా, నుండి లింగాపూర్, 90 కిలోమీటర్లు, ఆసిఫాబాద్ జిల్లా నుంచి 70 కిలోమీటర్లు దూరం ఉంటుంది. బస్సులో కానీ ఇతర ప్రైవేటు వాహనాల్లో గాని చేరుకోవచ్చు.



వ్యాసకర్త: రాథోడ్ శ్రావణ్
లెక్చరర్,
ప్రభుత్వం జూనియర్ కళాశాల
గుడిహత్నూర్, ఆదిలాబాద్ జిల్లా,
9491467715

# నిషేధిత గంజాయి పట్టివేత

## నాలుగు కిలోల గంజాయి స్వాధీనం.. పట్టుబడిన గంజాయి విలువ లక్ష రూపాయలు



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** నిషేధిత గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం ఉదయం ఇచ్చోడ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై తిరుపతి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం సోంపల్లి గ్రామానికి చెందిన గజానంద్ అనే వ్యక్తి తన పంట పొలంలో గంజాయి ని సాగు చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మాధవ్ అనే వ్యక్తి గజానంద్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి ఇచ్చోడ కూ తీసుకు వస్తున్నట్లు సమాచారం మేరకు ఇచ్చోడ లోని దుబార్ పేట సమీపంలో గల బ్రిడ్జి వద్ద పోలీ సులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు మాధవ్ ను పోలీసులు పట్టుకుని అతని వద్ద ఉన్న బ్యాగ్ ను తనిఖీ చేశారు. అతని వద్ద నుంచి నాలుగు కిలో గంజాయి ని స్వాధీనం పర్చుకున్నారు. దీని విలువ రూ. ఒక లక్ష వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఇచ్చోడ చుట్టు పక్కల గ్రామాల్లో తెలిసిన వారికి గంజాయిని విక్ర యిస్తూ, వచ్చిన డబ్బులను నిందితుడి తో పాటు, గంజాయిని సాగు చేస్తున్న గజానంద్ అనే వ్యక్తి చెరి సగం చొప్పున పంచుకునే వాళ్ళని విచారణ లో తేలిందన్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయిని సాగు చేస్తున్న గాజానంద్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

# సావిత్రిబాయి పూలే సేవలు అపూర్వం

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం.. సావిత్రిబాయి పూలే కు ఘన నివాళులు






**వాస్తవ నేస్తం,తలమడుగు:** చదువుల తల్లి జ్ఞాన జ్యోతి సావిత్రిబాయి పూలే 194వ జయంతిని, పురస్కరించుకొని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుంకిడి లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే వేషాధారణలో పదిమంది అమ్మాయిలు ఆకర్షణగా నిలిచారు. మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా బేగ్ వేషధారణలో ఆరవ తరగతి అమ్మాయి అందర్నీ అలరించింది. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే పాటపై 30 మంది విద్యార్థిని విద్యార్థులు యోగ్ చాపు ప్రదర్శన ఉగ్రూత లూగించింది.పాఠశాల హిందీ ఉపాధ్యాయులు మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అలాగే సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలను 18 మంది వేసి ముగ్గురు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలు వాణి ని , సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు రామేశ్వరరావు, ఉపాధ్యాయులు గజానంద్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నామ్దేవ్ విద్యా కమిటీ చైర్మన్ రమాకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### టీఎస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో నివాళులు

వాస్తవ నేస్తం,ఇచ్చోడ: తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సేవలు అపూర్వమని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం టీఎస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యావ నరుల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పు కోసం సావిత్రి బాయి పూలే పునాది వేశారని, మహిళల విద్యకు ప్రాధాన్యం కల్పించారని వారు పేర్కొన్నారు. అణచివేతలకు గురైన వారికి న్యాయం అందించేం దుకు ఆమె జీవితాన్ని అర్పించారని, లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం వారు స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, లక్ష్మణ్, భూమన్న, జ్ఞానోబా తదితరులు పాల్గొన్నారు.

### ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...



ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట కళాశాల ప్రిన్సిపల్ శంకర్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదటి మహిళ ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే అని, మహిళల చదువు కోసం ఎంతగానో కృషి చేశారని ఆమె సేవలు కొనియాడారు. విద్యార్థులు సావిత్రిబాయి పూలే ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వాస్తవ నేస్తం,బోథ్:** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు,ఎన్నో అవమానాలు, ఎన్నో ఆటంకాలు అధికమించి, స్త్రీ అభ్యున్నతి కొరకు నిరంతరం పోరాటం చేసి, ఎంతో మందికి విద్యను అందించిన గొప్ప వ్యక్తి... సావిత్రిబాయి పూలే గారి జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, (బాలికలు), బోథ్ పాఠశాలలో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దీకొండ సత్యనారాయణ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే సేవలు గురించి కొనియాడారు. ఆమె చొరవతో మహిళలందరికి విద్యను అందించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులందరు కూడా ఆమెను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానములో నిలవాలని కోరారు. అనంతరం పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజిత, అనసూయ, సతీష్ కుమార్, సవిత, నవ్యశ్రీ మరియు పాఠశాల చైర్మన్ లలిత పాల్గొన్నారు.

### బాలికల గురుకుల కళాశాలలో...



చదువుల తల్లి, మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బోథ్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల యందు సావిత్రిబాయి పూలే ఫోటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ సంగీత మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరి మూడవ తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయమని, మహిళ లోకాన్ని గౌరవించే విధంగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివాని ఆమె చొరవతోనే మహిళలందరికీ విద్య అందిందని తెలియజేశారు. బడుగు బలహీన వర్గాల కోసం తాను ఎంతో కృషి చేసి విద్యను అందించిన గొప్ప సంఘసంస్కర్త అని విద్యార్థుల కు తెలిపారు. అనంతరం పాఠశాలలోని మహిళఉపాధ్యాయురాళ్లకు ఉపాద్యాయులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లత, మాధవి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సోనాల ప్రాథమిక పాఠశాలలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోతన్న మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలె సేవలు ఎనలేనివని ఆమె చొరవతోనే మహిళలందరికీ విద్య అందిందని తెలియజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేసి అనంతరం పాఠశాల మహిళ ఉపాధ్యాయులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూలే వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు భగత్ ప్రవీణ్, పూలే వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శులు అమృత్ రావు పాటిల్, బాశెట్టి రమేష్, సొసైటీ సభ్యులు, భీమ్రావు పాటిల్, మొరుగు మహేష్, మొరుగు ప్రభాకర్, లక్ష్మణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వర్గీకరణపై సమగ్ర అధ్యయనం..

## ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ సమీమ్ అక్తర్

## ఇచ్చోడలో ఏక సభ్య కమీషన్ బృందం సందర్శన






**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అన్ని కోణాలలో అధ్యయ నం చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇవ్వనున్నట్టు ఏకసభ్య కమిషన్ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయ మూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ తో నియమించిన ఏకసభ్య కమీషన్ బృందం శుక్రవారం సాయంత్రం ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్ నగర్, ఎస్సీ కాలనీలను సంద ర్శించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకు న్నారు. ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు..? ఇతర రంగాలలో ఎంతమంది ఉపాధి పొందుతున్నారు..? గల్ఫ్ దేశా లకు వలస వెళ్లిన వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి, విదేశాలలో ఉన్నత విద్య కోసం ఓవర్సీస్ పథకం కింద పొందే లబ్ది, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తున్న కుటుంబాలు, బీడీ కార్మికులకు పెన్షన్, తదితర వివ రాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. పలువురు ఆయనకు వినతి పాత్రలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీక రణ తో ఆ వర్గాల సామాజిక స్థితిగతులపై బహిరంగ విచారణ జరిపి అందరి అభిప్రా యాలు తీసుకుంటున్నామనీ పేర్కొ న్నారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన వివిధ వర్గాల వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను పరిశీలించి, ప్రభుత్వా నికి సమర్పించే నివేదికలో అన్ని అంశాలను పొందు పరుస్తామని ఆయన స్పష్టం చేశారు.

## జగదాంబా దేవి జాతరలో ఆడే గజేందర్





**వాస్తవ నేస్తం,బోథ్:** సోనాల మండలం లోని దేవులనాయక్ తాండలో జగదంబ దేవి జాతరలో ఆడే గజేందర్ పాల్గొని, దేవిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆడే గజేందర్ మాట్లాడుతూ.. తారతరాలుగా వస్తున్న జగదంబ దేవి జాతర పవిత్రతాను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని ఇంతగొప్ప జాతర ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపారు. జగదంబ దేవి ఆలయ అభివృద్ధికి తొడ్పాటు అందిస్తానని అన్నారు. ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి బిల్డింగ్ నిర్మాణానికి క్లియరెన్స్ ఇప్పిస్తాని, అన్ని రకాల అభివృద్ధి పనులు చేపడతామణి తెలియజేసారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆడే గజేందర్ ను శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో యూత్ కంగ్రేస్ అసెంబ్లీ అధ్యక్షులు పోతారెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్,నిగిని సాయన్న, సినియర్ నాయకులు, బలిరామ్, గాజుల పోతన్న, పాల శెంకర్, కుంట శెంకర్, ముండే శ్రీధర్, హరి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## జగదంబ దేవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే అనిల్



**వాస్తవ నేస్తం,బోథ్:** పార్ది (బి) లో జరుగుతున్న జగదాంబ దేవి జాతరలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. నాయకులతో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ను ఆలయ సభ్యులు సన్మానించారు. ఎమ్మెల్యే కు బంజారా సాంప్రదాయ ప్రకారం ఆలయ కమిటీ వారు భోగ్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిల ఆట కట్టడానికే ఇంటర్ సెప్టర్: జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

**అత్యవసరాల సమయాలలో స్పందించే ఇంటర్ సెప్టర్ వాహనం ప్రారంభం**

**– జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ గౌష్**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆపద సమయాలలో ఆపద్భాంధవుడు ఇంటర్ సెప్టర్ వాహనం పనిచేస్తోంది అని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేం దుకు ప్రత్యేకమైన ఇంటర్ సెప్టర్ వాహనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో జరిగే నేరాలను అడ్డుకట్ట వేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఆరుగురు సిబ్బందితో ప్రత్యేక ఇంటర్ సెప్టెర్ వాహనాన్ని ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ వాహనంలో ఉన్న సిబ్బంది ద్వారా ప్రమాదాలు నివారించేందుకు ఎక్కువగా ప్రమాదాలు సంభవించే హాట్ స్పాట్ ల వద్ద తగు నియంత్రణా చర్యలను చేపడుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా ప్రాణ నష్టం జరగకుండా ప్రమాదాలను అరికట్టే ప్రమాదం సంభవించే ముఖ్యమైన బ్లాక్ స్పాట్ వద్ద సిబ్బందిని కేటాయించి తగు జాగ్రత్త చర్యలను చేపడుతుందని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ముఖ్యమైన ప్రదేశాలు, జాతరలు, సమావేశాలు, సభలు, ప్రజలు గుమిగూడి ఉండే కార్యక్రమాల వద్ద సిబ్బంది ఎలాంటి ప్రజల ఆస్తికి నష్టం కలగకుండా దొంగతనాలను నివారించేందుకు పక్కా ప్రణాళికతో కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తుందని తెలిపారు. అత్యవసర సమయాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సందర్భాలలో అల్లరి మూకలపై అత్యవసరం గా స్పందించి నివారణ చర్యలను చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పటన సీఐలు సునీల్, కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఇంటర్ సెప్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాతృభూమి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**– ప్రతి శుక్రవారం తిరుపతమ్మ దేవస్థానంలో అన్నదానం**



**వాస్తవ నేస్తం,ఖమ్మం:** మాతృభూమి సేవ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో ముందుంటోంది. మాతృభూమి ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణ అభాగ్యుల ఆకలి తీర్చడంలో నేనున్నానని ముందుకు వస్తున్నారు. ప్రతి శుక్రవారం తిరుపతమ్మ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గుడి కమిటీ స్వామి, మాతృభూమి ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణ శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భక్తులకు వడ్డన చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గోపి, భక్తులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com